
సాక్షి పల్నాడు

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలిపూజ

తెనాలిఅర్బన్: తపస్సు కాలం మొదటి రోజును పురస్కరించుకుని చెంచుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించారు.



రైల్వే బ్రిడ్జి పనుల పరిశీలన

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం బైపాస్‌లో నిర్మాణంలోఉన్న రైల్వే బ్రిడ్జిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం పరిశీలించారు.



కనులపండువగా కల్యాణోత్సవం

మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్బారాయుడి కల్యాణోత్సవం బుధవారం రాత్రి కనులపండువగా జరిగింది.

న్యూస్‌రీల్

మహా శివరాత్రి ఉత్సవాలకు సమన్వయంతో పనిచేయాలి



అమరావతి: మహా శివరాత్రికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అమరేశ్వర స్వామి ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ కోరారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 8వ తేదీ మహాశివరాత్రి ఉత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. దేవాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఈఓ వేమూరి గోపినాథశర్మతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల గడువు పెంపు

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో గ్రేడ్‌–2 ఫార్మశిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 17 వరకు గడువు పొడిగించినట్లు ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పది ఫార్మశిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులను భర్తీ చేస్తామని, అభ్యర్థులు దరఖాస్తులను గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలన్నారు.

నేడు స్టాఫ్‌నర్సులకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 20 మందికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్ నర్సులుగా ప్రమోషన్ ఇవ్వనున్నట్లు ఆర్డీ డాక్టర్ జి.శోభరాణి తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు ప్రమోషన్ జాబితాలో ఉన్నవారు ఉదయం 11 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు కీలకం

ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్‌కుమార్‌రెడ్డి



బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే ఆర్టీసీ సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాపట్లలోని డిపో గ్యారేజ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం బుధవారం నిర్వహించారు. విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి డిపో నుంచి ముగ్గురు చొప్పున జిల్లాలో 15 మంది డ్రైవర్లకు ఉత్తమ డ్రైవర్లుగా ఎంపిక చేసి వారికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు బస్సులు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా వివరించినట్లు చెప్పారు. బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు మాట్లాడుతూ బస్సులు నడిపే ప్రతి ఒక్కరు మద్యపానాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీటీఓ సురేష్, బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె డిపో మేనేజర్లు, ట్రాఫిక్, మెకానికల్ ఇన్‌చార్జిలు, నాలుగు డిపోల నుంచి అన్ని అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో బుధవారం కల్యాణ తలంబ్రాలు కలిపే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 23న జరిగే గోపయ్య సమేత తిరుపతమ్మవారి కల్యాణం అనంతరం భక్తులకు తలంబ్రాలు అందించేందుకు క్వింటా బియ్యాన్ని ముందుగా పసుపు, కుంకుమ, నెయ్యి, పలు సుగంధ ద్రవ్యాలతో కలిపించారు. వీటిలో కల్యాణ తలంబ్రాలను కలిపి కల్యాణ వేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులందరికీ పంపిణీ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు కాకాని అలేఖ్య, బొశెట్టి విజయలక్ష్మి, బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, వీర్ల రమణ పాల్గొన్నారు.



నరసరావుపేటలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనసంద్రం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్, వేదికపై మంత్రులు అంబటి, కారుమూరి, ఎమ్మెల్యేలు నంబూరు, గోపిరెడ్డి, బొల్లా



గజమాలతో స్వాగతం పలుకుతున్న పిట్లవానిపాలెం అభిమానులు

బీసీ బిడ్డను గెలిపించే బాధ్యత మీదే

- నెల్లూరు నుంచి బాధగా వచ్చా
- పల్నాడు ప్రజలు ఆప్యాయతతో స్వాగతం పలికారు
- మీకు సేవ చేసి మీ రుణం తీర్చుకుంటా
- గొర్రెల కాపరి వాడు అంటే టీడీపీ వారికి చులకన భావన
- నరసరావుపేట బహిరంగ సభలో సమన్వయకర్త అనిల్ కుమార్ యాదవ్
- ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



సాక్షి, నరసరావుపేట: బీసీ బిడ్డను గెలిపించి పార్లమెంట్‌కు పంపే బాధ్యత పల్నాడు జిల్లా ప్రజలదేనని నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. తొలిసారి జిల్లాలో అడుగిడిన సందర్భంగా బుధవారం నరసరావుపేటలోని పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జగనన్న ఆదేశాల మేరకు నెల్లూరు నుంచి వచ్చే సమయంలో చాలా బాధపడ్డా.. మనసుకు భారంగా అనిపించిందన్నారు. కానీ పల్నాడు జిల్లా ప్రజల ప్రేమ, ఆప్యాయతలతో పలికిన స్వాగతం చూసి చాలా ఆనందంగా ఉందన్నారు. మీ అందరి సహకారంతో ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిచి మీకు సేవ చేసి రుణం తీర్చుకుంటానన్నారు. ఓ గొర్రెల కాపరికి మంత్రి పదవి ఇచ్చారని టీడీపీ వారు నన్ను అవహేళన చేశారు. వారికి ఒకటే చెబుతున్నా.. శ్రీకృష్ణుడు గొర్రెలకాపరి, ఏసుప్రభు పుట్టింది గొర్రెల చావడిలో అని గుర్తుంచుకోండి. నారా భువనేశ్వరి తన ఆస్తిలో 2 శాతం అమ్మితే రూ.400 కోట్లు వస్తుందన్నారు. అంటే వారి ఆస్తి సుమారు రూ.20 వేల కోట్లు. ఇదంతా ఆవులు, గేదేలు కాసే బీసీ బిడ్డలు పాలు పితికి మీకు పోస్తేనే సంపాదించారని గుర్తుచేశారు. కోటప్పకొండ శివయ్య సాక్షిగా చెబుతున్నా జగనన్న నన్ను రాజకీయంగా ఎంతో ప్రోత్సహించారు.. ప్రతీ అడుగులో అండగా నిలిచారన్నారు. తక్కువ సమయంలో ఉండటంతో వీలైన ఎక్కువ మందిని కలిసే ప్రయత్నం చేస్తానని, ఎవరైనా కలవలేకపోతే 5 ఏళ్లు ఎంపీగా ఉన్న సమయంలో కలుస్తానన్నారు.



సభా వేదికపై మంత్రులు అంబటి, కారుమూరి, అనిల్‌కుమార్ యాదవ్, పీఆర్కేలను పూలమాలతో సత్కరిస్తున్న దృశ్యం



కోటప్పకొండ రోడ్డులో పార్టీ శ్రేణుల భారీ ర్యాలీ

భారీ జోష్...

అనిల్ కుమార్ యాదవ్ పల్నాడులో అడుగుపెట్టిన సమయం నుంచి బహిరంగసభ ముగిసే వరకు కార్యకర్తల్లో భారీ జోష్ కనిపించింది. అనిల్‌కు ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. అనిల్ ప్రసంగించే సమయంలో యువత కేకలతో సభ దద్దరిల్లింది. కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, నాగార్జున యాదవ్, ఖలీల్ అహ్మద్, నిమ్మకాయల రాజనారాయణ, యనుముల మురళీధర్‌రెడ్డి, గజ్జల నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న బాణం అనిల్

జగనన్న వదిలిన బాణం అనిల్‌కుమార్ యాదవ్. అనిల్ పేరు ప్రకటనతో జిల్లా రాజకీయాల్లో పెనుమార్పులు వచ్చాయి. నెల్లూరు వారికి నరసరావుపేట ప్రాంతానికి అవినాభావ సంబంధం ఉంది. ఇక్కడ నేదురుమల్లి జనార్ధనరెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డిలను ఎంపీగా గెలిపించిన చరిత్ర ఉంది. అనిల్ ఎంపీగా గెలవడంతోపాటు మేం ఏడు మంది ఎమ్మెల్యేలుగా గెలుస్తాం.

– నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే

2019 ఫలితాలు రిపీట్ చేస్తాం...

అనిల్‌కుమార్ యాదవ్‌ను పార్లమెంట్ ఇన్‌చార్జిగా ప్రకటించడంతో జిల్లా వైఎస్సార్ సీపీలో జోష్ పెరిగింది. ఇదే ఉత్సాహం ఎన్నికలు అయ్యేవరకు కొనసాగించాలి, 2019లో మాదిరి 2024లో కూడా జిల్లాలో అన్ని స్థానాల్లో స్వీప్ చేయబోతున్నాం.

–మల్లెల రాజేష్‌నాయుడు, చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త

బీసీలకు దక్కిన అవకాశం

ఎందరో అతిరథ మహారథులు ఎంపీలుగా పనిచేసిన నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో తొలిసారి బీసీలకు అవకాశం దక్కింది. దీన్ని ప్రతి బడుగు, బలహీన వర్గాలు వారు సద్వినియోగం చేసుకుని అనిల్ యాదవ్‌ను గెలిపించుకోవాలి. అనిల్ గెలిస్తే మనకు మరిన్ని అవకాశాలు వస్తాయని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. బీసీలకు అవకాశం ఇద్దాం గుంటూరులో పోటీ చేయమంటే లావు శ్రీకృష్ణదేవరాయలు పార్టీ మారారు. అటువంటి వ్యక్తికి బీసీల ఓట్లు అడిగే హక్కు ఏమాత్రం లేదు. పల్నాడులోని ఏడు నియోజకవర్గాలు అనే రథాలను నడిపించే శ్రీకృష్ణుడు అనిల్ యాదవ్. జగనన్న ఆదేశాలతో మారు మాట్లాడకుండా పల్నాడు వచ్చిన అనిల్‌ను గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇద్దాం.

– అంబటి రాంబాబు, మంత్రి

బీసీ ద్రోహి చంద్రబాబు

మూడుసార్లు ముఖ్యమంత్రిగా గెలిచిన చంద్రబాబునాయుడు ఒక్కరంటే ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు. బీసీల ద్రోహి, వారిని వంచించిన వ్యక్తి చంద్రబాబు. తొలిసారి సీఎం అయిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి తన బీసీ పక్షపాతాన్ని నిరూపించుకున్నారు. గతం కంటే ఎక్కువ చోట్ల బీసీలకు ఎంపీ సీట్లు ఇచ్చి రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి చెప్పండి... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరిగేది ఒక్క వైఎస్సార్ సీపీలోనే అని. పల్నాడులోని ఏడు అసెంబ్లీ, ఎంపీ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించండి.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మంత్రి

ఏపార్టీ ఆలోచించ లేదు

నరసరావుపేట లాంటి ప్రతిష్టాత్మకమైన స్థానం నుంచి ఎంపీగా బీసీలకు అవకాశం ఇవ్వాలని ఏ పార్టీ ఆలోచించ లేదు. ఒక్క వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ మాత్రమే సాహసం చేసింది. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసి రాజకీయంగా కొత్త శకానికి నాంది పలుకుదాం. నంబూరు శంకరావు పార్టీ మారుతున్నాడు అంటూ కావాలనే విషప్రచారాలు చేస్తున్నారు, శంకరావు పెదకూరపాడు నుంచే పోటీచేసి గెలుస్తారు.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

గొర్రెలు కాపరి ఎంపీ అవుతున్నాడు

గత 25 ఏళ్లుగా నరసరావుపేట ఎంపీగా కోటీశ్వరులే గెలుపొందున్నారు. తొలిసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన సామాన్యుడు అనిల్ పోటీ చేస్తున్నాడు. లావు లాంటి వ్యక్తి రూ.100 కోట్లు గుమ్మరిస్తాడు, అనిల్ ఎలా గెలుస్తాడు అంటూ టీడీపీ వారు తక్కువ చేసి మాట్లాడుతున్నారు. ఓ గొర్రెల కాపరి బిడ్డ దెబ్బకు బ్యాలెట్ బాక్సులు ఎలా బద్దలు అవుతాయో చూడండి. ఇప్పుడు ఓ బీసీని గెలిపించి చరిత్ర సృష్టిస్తే, భవిష్యత్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారు సైతం ఎంపీగా గెలుపొందే అవకాశం వస్తుంది.

– కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్యే

విఫలమైతే మరోసారి అవకాశం దక్కదు

బీసీలను ఎక్కువ సంఖ్యలో పార్లమెంట్‌కు పంపాలని జగనన్న ప్రయోగం చేస్తున్నారు. అందులో భాగంగా జగనన్న రామబంటు అనిల్ యాదవ్‌కు నరసరావుపేట ఎంపీగా అవకాశం ఇచ్చారు. బీసీలను ఎంపీలుగా గెలిపించకపోతే ప్రయోగం విఫలమై మరోసారి బడుగు, బలహీనవర్గాలకు అవకాశం దక్కదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని బీసీలకు రాజకీయంగా ముందుకు పంపుదాం. లావు రాజీనామా చేయగానే మేమంతా ఏక కంఠంతో అనిల్ యాదవే ఎంపీగా పోటీచేయాలని జగనన్నను కోరాం.

– గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే

ద్రోహం చేసిన వారిని ఓడిస్తాం

కొంతమంది వైఎస్సార్‌సీపీ ద్వారా గెలుపొంది పదవులు పొంది నేడు పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయారు. వారిని ఓడించి తగిన గుణపాఠం చెబుతాం. మేము ధర్మపోరాటం చేస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగనన్న ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత దక్కింది. 30 మందికి పైగా కాపులను ఎమ్మెల్యేలను చేసిన ఘనత జగన్‌కు దక్కుతుంది. పవన్ నువ్వు ఎంతమంది కాపులను పోటీ చేయిస్తున్నావు, ఎంతమందిని ఎమ్మెల్యేలను చేస్తున్నావో చెప్పు.

– బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే



చిలకలూరిపేటలో ఎడ్లబండిపై అనిల్, మల్లెల

అనిల్‌కుమార్‌కు ఘన స్వాగతం



బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద అనిల్ కుమార్ యాదవ్‌కు స్వాగతం పలికిన చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు , వైఎస్సార్ సీపీ శ్రేణులు

- పెట్లూరివారిపాలెం వద్ద గజమాలతో స్వాగతం
- వందలాది కార్లు, ద్విచక్రవాహనాలతో జిల్లా కేంద్రంలోకి ప్రవేశం
- హాజరైన ఎమ్మెల్యేలు పిన్నెల్లి, డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. బుధవారం నెల్లూరు నుంచి వందలాది కార్లతో ర్యాలీగా తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గానికి సాయంత్రం నాలుగు గంటలకు వచ్చిన ఆయనకు కోటప్పకొండలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆహ్వానం పలికారు. త్రికోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెట్లూరివారిపాలెం గ్రామం చేరుకున్న వారికి ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు నాయకత్వంలో పార్టీ శ్రేణులు గజమాలతో స్వాగతం పలికారు. వందలాది మంది మహిళలు, నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. కారు దిగి కార్యకర్తలకు కరచాలనం చేశారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత వైఎస్సార్, గ్రామ నాయకుడు దివంగత కటికినేని వెంకటరమణ సుబ్బారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి అడుగడుగునా ప్రజల నీరాజనాల మధ్య వందలాదిమంది నాయకులు, కార్యకర్తలు కార్లు, ద్విచక్రవాహనాల ర్యాలీతో తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని నరసరావుపేట పట్టణానికి చేరుకున్నారు. చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. స్థానిక నరసరావుపేట మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల (నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లు) శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని కోరారు. వచ్చిన సందేహాలనుపై అధికారులను అడిగి ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల విధులలో జాగ్రత్త అవసరమని అన్నారు. ఎన్నికల కమిషన్ నూతనంగా ప్రవేశ పెట్టిన హోమ ఓటింగ్, పోస్టల్ ఓటింగ్‌లపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు రోజు, ఎన్నికల రోజు, ఎన్నికల తదుపరి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీగా గాంధీరెడ్డి బాధ్యతల స్వీకరణ



జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా ఏఆర్ డీఎస్పీగా జి.మహాత్మాగాంధీరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన నెల్లూరు ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో జిల్లాకు వచ్చారు. సత్తెనపల్లి రూరల్ సీఐగా ఎం.రాజేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించి జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం

- అధికారులకు జేసీ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశం
- అయ్యన్నపాలెం, చక్రాయపాలెంలో భూముల పంపిణీ పరిశీలన

బొల్లాపల్లి:నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కేటాయించిన స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా పూర్తి చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధికారుల్ని ఆదేశించారు. మండలంలో భూ పంపిణీ, జగనన్న కాలనీల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. తొలుత చక్రాయపాలెం, అయ్యన్నపాలెంలో పర్యటించారు చక్రాయపాలెం సచివాలయ పరిధిలో మిలటరీ వారికి ఇవ్వనున్న భూములతో పాటు అయ్యన్నపాలెం సచివాలయ పరిధిలో మేకలదిన్నె తండాలో 436 ఎకరాలకు గాను 203 మంది లబ్ధిదారులకు చేపట్టిన భూ పంపిణీ గురించి స్థానిక అధికారుల నుంచి వివరాలు సేకరించారు. మొదటి విడతగా అయ్యన్నపాలెంలో కొందరికి భూ పంపిణీ చేశారు. అనంతరం రెండవ విడత భూ పంపిణీని పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. అనంతరం రేమిడిచర్ల సచివాలయానికి చేరుకొని, జగనన్న కాలనీకి చెందిన నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ తీరును పరిశీలించారు. సర్వర్ సరిగా పని చేయకపోవడంతో జరుగుతున్న జాప్యాన్ని గుర్తించి స్థానిక అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు పొందిన వారితో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూ పంపిణీ ప్రక్రియ జాగ్రత్తగా చేపట్టాలని చెప్పారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మారుమూల ప్రాంతాల్లో నెట్ సౌకర్యం కల్పించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిర్వాహకులకు అడ్డంకులు లేకుండా సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ బి.వి.రమణారావు, ఎంపీడీవో వి.ఎ.విజయ్‌కుమార్, డీటీ వి.సుధాకర్‌శర్మ, ఈవో పీఆర్డీ షేక్ జిలానీబాషా, మండల సర్వేయర్ జి.ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అయ్యన్నపాలెం సచివాలయం పరిధిలో భూములను పరిశీలిస్తున్న జేసీ, అధికారులు

అప్రమత్తం.. 'ప్రత్యేక' వైద్యం

- నిలకడగా అందరి ఆరోగ్యం
- 41 మంది డిశ్చార్జి
- 24 గంటలూ విధుల్లో ప్రత్యేక వైద్య బృందాలు
- సహాయ కేంద్రం కౌంటర్ ఏర్పాటు

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: వాంతులు, విరేచనాలతో గుంటూరు జీజీహెచ్‌లో ఈనెల 10వ తేదీ నుంచి చికిత్స పొందుతున్న వారికి సూపర్‌స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నారు. సూపర్‌స్పెషాలిటీ వైద్యులైన నెఫ్రాలజిస్టులు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు, కార్డియాలజిస్టులు 24 గంటలూ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. వీరితోపాటు జనరల్ మెడిసిన్ వైద్యులు, డెప్యూటీ సూపరింటెండెంట్లు, డెప్యూటీ ఆర్‌ఎంఓలు, అసిస్టెంట్ ఆర్‌ఎంఓలు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, ఫార్మసీ సిబ్బంది, బయోమెడికల్ ఇంజినీర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లతోపాటు, ఆఫీస్ సిబ్బంది, ఆరోగ్య మిత్రలు, సార్జంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మూడు పూటలా అందుబాటులో ఉంటూ బాధితులకు సకాలంలో స్పెషాలిటీ వైద్యం అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. ఆసుపత్రి అత్యవసర సేవల విభాగంలో నూతనంగా నిర్మించిన ఐసీయూతోపాటు, ఇన్ పేషెంట్ విభాగంలో ఆధునికీకరించిన జనరల్ సర్జరీ వార్డులో బాధితులను ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ 24 గంటలూ వైద్యులు, వైద్య సిబ్బందిని మానిటరింగ్ చేసుకుంటూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండి, నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నారు.

తక్షణమే వైద్యం అందేలా..

ఆసుపత్రిలో 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 139 మంది వాంతులు, విరేచనాలతో చికిత్స కోసం చేరారు. వీరిలో ఆరోగ్యం కుదుటపడి 41 మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం 98 మంది చికిత్స పొందుతున్నారు. బాధితులకు, కుటుంబ సభ్యులకు తక్షణమే సాయం అందించేందుకు క్యాజువాల్టీలో ప్రత్యేకంగా సహాయ కేంద్రం కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. అందులో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండి, బాధితులకు సమాచారాన్ని, సహాయాన్ని, సహకారాన్ని అందిస్తున్నారు.

యంత్రాంగం ప్రత్యేక దృష్టి

వాంతులు, విరేచనాల కేసులు జీజీహెచ్‌కు వస్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై గుంటూరు జీజీహెచ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి, నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, ఇతర అధికారులు, నేతలు ప్రతిరోజూ ఆసుపత్రిలో రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లి రోగులను పరామర్శించి ధైర్యం నింపుతున్నారు. బాధితుల ఇళ్ల వద్దకు సైతం వెళ్లి వారికి మనోధైర్యం కల్పిస్తున్నారు. బాధితుల సంఖ్య కట్టడి చేసేందుకు ఇంటింటికి తిరిగి వైద్యులు, వైద్య సిబ్బంది సర్వే నిర్వహించి శాంపిల్స్ సేకరించి వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఏరియాల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తక్షణ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రత్యేకంగా 108 అంబులెన్సులను సైతం అందుబాటులో ఉంచి ఎవరికైనా తీవ్ర అస్వస్థత ఏర్పడితే తక్షణమే వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రాణ రక్షణే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం, వైద్యులు, వైద్య అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో లభిస్తున్న వైద్యసేవలపై, ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవకు బాధిత కుటుంబాలు సైతం హర్షం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య

మార్టూరు: పరీక్షలు సరిగ్గా రాయలేనేమోననే బెంగతో మానసిక ఒత్తిడికి గురైన ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం సాయంత్రం మార్టూరులో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బలరాం కాలనీకి చెందిన తిరుమలశెట్టి నాగేశ్వరరావు కుమార్తె ప్రవల్లిక (16) చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. త్వరలో జరగబోతున్న పరీక్షలు సరిగా రాయలేనేమోనని తరచూ స్నేహితులతో చెప్పే ప్రవల్లిక మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

17మందికి ఉద్యోగ పత్రాల అందజేత



నియామక పత్రాలు పొందిన వారితో జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి కలెక్టర్ ఎల్.శివశంకర్ నియామక పత్రాల్ని అందజేశారు. నవోదయంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు 39 మంది నిరుద్యోగులు హాజరు కాగా, అందులో 17 మంది ఎంపికయ్యారు.

నవోదయంలో ఇద్దరికి కార్డు పంపిణీ

కలెక్టరేట్‌లోని బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో ప్రతి నెలా 14వ తేదీన నిర్వహించే నవోదయం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అభ్యర్థుల వినతుల్ని నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో గణపతి పరిశీలించారు. జిల్లా నుంచి 110 మంది బ్యాంక్ రుణాలు, ఉద్యోగ అవకాశాల కోసం అర్జీ పెట్టుకొన్నారు. కాగా, గతంలో నిర్వహించిన నవోదయంలో లబ్ధిదారులైన వెనిగండ్ల గ్రామవాసి బి లక్ష్మయ్య, పిడుగురాళ్ల గ్రామానికి చెందిన ఎ.దానమ్మలకు బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చిన కార్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.

రేపు కంతేరు నర్సరీలో చెట్ల ఫలసాయానికి వేలం

తాడికొండ: గుంటూరు జిల్లా కంతేరులోని ప్రభుత్వ నర్సరీలో చెట్ల ఫలసాయానికి సంబంధించి వేలం నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి 40 మామిడి మొక్కలు, 180 మామిడి మొక్కలు, 40 సపోటా, 50 కొబ్బరి మొక్కలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. పాటదారులు ముందుగా ధరావత్తు రూ.5 వేలు జిల్లా ఉద్యాన అధికారి, గుంటూరు వారి పేరుమీద కానీ లేదా వేలానికి గంట ముందు నేరుగా గానీ చెల్లించాలని తెలిపారు. ఇతర నియమాలు అన్నీ అధికారుల ఆదేశాల మేరకు వర్తిస్తాయన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర ఎనలేనిది



సన్మానం పొందిన డ్రైవర్లతో ఆర్డీవో పరంధామరెడ్డి, ఆర్టీసీ అధికారులు

నరసరావుపేట: ప్రజా రవాణా వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర ఎనలేనిదని ఆర్డీవో టి.పరంధామరెడ్డి, జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. డ్రైవర్లు మద్యానికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమనే నమ్మకాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ డిపోల్లో సుదీర్ఘ కాలం ప్రమాద రహితంగా బస్సుల్ని నడిపిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఉత్తమ డ్రైవర్లుగా నిల్చిన పిడుగురాళ్ల, వినుకొండలకు చెందిన ఆర్.వెంకటేశ్వర్లు, వై.రాజు, షేక్ వలీలకు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి అధ్యక్షత వహించగా, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ మృతిపై కొనసాగుతున్న విచారణ

శ్రీనాథ్ అత్త, మామను విచారించిన సీఐడీ

నగరంపాలెం: ఎన్‌ఆర్‌ఐ యువకుడు గంగూరి శ్రీనాథ్ అనుమానాస్పద మృతి కేసులో విచారణ కొనసాగుతుంది. ఈ క్రమంలో మృతుడి అత్త, మామను రెండు రోజులు ఏపీ సీఐడీ పోలీసులు విచారించారు. 2022 అమెరికాలో ట్రెక్కింగ్‌కు శ్రీనాథ్, భార్య సాయి చరణి వెళ్లారు. అక్కడ భర్త శ్రీనాథ్ జారిపడి మృతి చెందినట్లు భార్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. అయితే. కొడుకు మరణంపై అనుమానాలు ఉన్నాయంటూ శ్రీనాథ్ తండ్రి బాబూరావు సీఐడీ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో శ్రీనాథ్ మృతిపై గత డిసెంబర్‌లో భార్య సాయిచరణి, అత్త రాజశ్రీ, మామ సుఖవాసి శ్రీనివాసరావుపై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం విదితమే. మంగళవారం సుఖవాసి శ్రీనివాసరావును గుంటూరు రీజినల్ సీఐడీ కార్యాలయంలో విచారించారు. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగగా, మధ్యాహ్నం రెండు గంటలుపాటు భోజనానికి విరామం ఇచ్చారు. ఇక గుంటూరు జేకేసీ కళాశాల రోడ్ విజయపురికాలనీలో ఉంటున్న సుఖవాసి రాజశ్రీని బుధవారం విచారించారు. ఉదయం 11.30 గంటలకు మొదలైన విచారణ రెండు గంటలపాటు చేపట్టారు. మరో వారం రోజుల్లో తదుపరి విచారణ ఉంటుందని సమాచారం.

చందూస్ కప్ విజేత విజ్ఞాన్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): 27వ చందూస్ సిల్వర్ క్రికెట్ కప్ విజేతగా విజ్ఞాన్ యూనివర్సిటీ నిలిచింది. బుధవారం స్థానిక జేకేసీ కళాశాలలో జరిగిన ఫైనల్స్‌లో ఆ జట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ జట్టుపై విజయం సాధించింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ విజేతలకు కప్‌ను, రన్నర్స్‌కు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జట్టు ఎంతో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిందని తెలిపారు. తమ కళాశాల మొదటి నుంచి విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటూరి నాగేశ్వరరావు, కుప్పుస్వామి, పరుచూరి గోపీచంద్, రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ఘనంగా వసంత పంచమి



రాధాశ్యామ్ సుందరులకు పుష్పాభిషేకం నిర్వహిస్తున్న ముకుంద మాధవ్‌దాస్

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలోని ఇస్కాన్ టెంపుల్‌లో బుధవారం రాధాశ్యామ సుందరుల 22వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షుడు చక్రధరిదాస్ మాట్లాడుతూ రాధాశ్యామ సుందరుల వార్షికోత్సవం, వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున మంగళహారతి, పూజలు నిర్వహించామని తెలిపారు. భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం రాధా శ్యామసుందరులకు 1000 కేజీల పుష్పాలతో అభిషేకం చేశామని చెప్పారు. 108 రకాలతో భోగా సమర్పించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారని ఆయన వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు ముకుంద మాధవదాస్, పాతూరి నాగభూషణం, ఇస్కాన్ భక్తులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో ఎన్నారై అకాడమీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో తిలక్‌బాబు, ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఎన్నారై అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు తెలిపారు. బుధవారం లక్ష్మీపురం క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు జవ్వాది జగన్నాథ సూరి 99.85, మార్తుల వెంకట నాగ రోహిత్ 99.82, నేరెళ్ల లీలా వెంకటసాయి 98.49, పులి వంశీకృష్ణ 98.24, కుమ్మిత బ్రహ్మారెడ్డి 97.92, షేక్ అబ్దుల్ మన్నన్ 96.71, అందెల సౌమ్యశ్రీ 96.20 పర్సంటైల్ సాధించి సత్తా చాటారని పేర్కొన్నారు. వివిధ సబ్జెక్టుల్లో 100 మందికి పైగా విద్యార్థులు 95కు పైగా పర్సంటైల్ సాధించడం గర్వకారణమని తెలిపారు. గత రెండేళ్లుగా ప్రణాళికాబద్ధమైన బోధనతో తాజాగా అత్యుత్తమ ఫలితాలు సాధించామని చెప్పారు. ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులను కృతజ్ఞతలు తెలియజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అధ్యాపకులను తిలక్‌బాబుతో పాటు సీఈఓ సీహెచ్. ఉమామహేశ్వరరావు సన్మానించారు. కార్యక్రమంలో డీన్ శర్మ, వివిధ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరావు, నాగచౌదరి, కృష్ణారెడ్డి, రమణయ్య, లక్ష్మణరావు, శివన్నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

17న కబడ్డీ ఎంపికలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వృంద మహిళా కళాశాలలో ఈనెల 17న ఉదయం 10 గంటలకు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సబ్ జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపికలు జరుగుతాయని జిల్లా సెక్రెటరీ ఎం.సుబ్బరాజు బుధవారం తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు గుంటూరు జిల్లా జట్టు తరఫున ఈ నెల 21 నుంచి 23 వరకు వృంద మహిళా కళాశాలల్లో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు బరువు 55 కేజీల్లోపు ఉండాలని, 2008 మార్చి 19 తర్వాత జన్మించిన వారై ఉండాలని చెప్పారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 77998 80670, 90520 35335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.